క్లుప్తంగా

ఈ-పంట నమోదుతో రైతుకు లాభాలు

మధురపూడి: ఈ-పంట నమోదు చేసుకోవడం ద్వారా రైతులకు మేల జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారి ఎ.గౌరీదేవి తెలిపారు. కోరుకొండ మండలంలో ఇప్పటి వరకూ 7 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ-క్రాప్ నయోదయ్యింది. సెప్టెంబరు 15వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు.

22న సామాజిక తనిఖీ ప్రజావేదిక

పెదపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ నెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ మండలంలో 17వ విడత సామాజిక తనిఖీ 2023 జనవరి ఒకటో తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖాధికారులు, ఉపాధి హామీ పథకం మేట్లు, వేతనదారులు, సిబ్బంది హాజరుకావాలని ఆయన కోరారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

పెదపూడి: దుప్పలపూడి గ్రామంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి టీకాల నివారణ కార్యక్రమం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం ప్రారంభించారు. పాడి పరిశ్రమ అభివృద్ధి, పశువుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధశాఖ డీడీ వెంకటేశ్వరరావు, డీఎల్‌డీఏ ఈఓ రమేష్, తూర్పు గోదావరి జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అనపర్తిలో ఐఎల్‌టీడీ కంపెనీ వద్ద కార్మిక యూనియన్‌కు సంబంధించిన టీఎన్‌టీయూసీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. రామవరంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లతో అభివృద్ధి పనులు, ఇళ్ల స్థలాలపై సమీక్షించారు.

పౌష్టికాహారం పంపిణీ



మల్లిపూడిలో కిట్లు అందిస్తున్న సర్పంచ్ మాధవి

రంగంపేట: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని గ్రామ సర్పంచు వేము మాధవి అన్నారు. మల్లిపూడి గ్రామంలో అంగన్వాడీ 1, 2 కేంద్రాల వద్ద మంగళవారం గర్భిణులు, బాలింతలు పౌష్టికాహార కిట్లను సర్పంచ్ మాధవి, ఉప సర్పంచ్ మేడిది చక్రం అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఎర్రకోట నుంచి వచ్చిన జీఎస్ఎల్ బృందం



ఢిల్లీ నుంచి వచ్చిన జీఎస్ఎల్ బృందాన్ని అభినందిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు, తదితరులు

రాజానగరం: దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ తరపున జీఎస్ఎల్ వైద్య కళాశాల నుంచి అతిథులుగా పాల్గొని, తిరిగి కళాశాలకు వచ్చిన బృందాన్ని కళాశాల వ్యవసాపకులు డాక్టర్ గన్ని భాస్కరరావు తదితరులు అభినందించారు. ఈ బృందంలో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ కె.వాణీమాధవి, వలంటీర్లు భాగ్యశ్రీ, సాహిత్ భరద్వాజ్‌లున్నారు.

నగరపాలక సంస్థ పెట్రోల్ బంక్ ప్రారంభిస్తాం

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పెట్రోల్ బంక్ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషను లిమిటెడ్ ప్రతినిధులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మంగళవారం నగరంలో పలు ప్రాంతాల్లో అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని పార్కులను స్వచ్ఛంద సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్, దాతలకు అప్పగించే ఆలోచన చేస్తున్నామన్నారు. నగరంలో క్వారీ మార్కెట్ జంక్షన్ సమీపంలో నగర పాలక సంస్థకు చెందిన స్థలంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషను లిమిటెడ్ ద్వారా పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నగర పాలక సంస్థ వాహనాలతో పాటు బయట వాహనాలకు డీజిల్, పెట్రోల్ అమ్మకాలు చేస్తారన్నారు. దాని ద్వారా వచ్చే కమీషన్ నగరపాలక సంస్థకు చెందుతుందన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషను లిమిటెడ్ బంకు నిర్మాణం పూర్తి చేసి అప్పగించగా నిర్వహణ మొత్తం నగరపాలక సంస్థ చేపడుతుందన్నారు. అనంతరం ఆంధ్రకేసరి కాలేజీ వద్ద నిర్మించిన పార్కును సందర్శించారు. అదనపు కమిషనరు పీఎం సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, డిప్యూటీ కమిషనరు ఎస్.వెంకటరమణ, డిప్యూటీ సిటీ ప్లానర్ బాలాజి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శేషగిరిరావు, మదర్షా ఆలీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బండి.. ఇక రాదండీ..

- ఇంటింటికీ రేషన్‌కు స్వస్తి
- చౌక దుకాణాల వద్దే బియ్యం సరఫరా
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలకు కష్టాలు మొదలు
- ఆందోళన చెందుతున్న వృద్ధులు

ఏ ఇబ్బంది లేకుండా ఇంటి వద్దే రేషన్ తెచ్చే బండి ఇకపై రాదు.. రేషన్ సరకులు చౌక ధరల దుకాణాలకు వెళ్లి తీసుకోవాల్సిందే. కొత్త ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పథకానికి స్వస్తి పలికింది. కూటమి నిర్ణయంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వృద్ధులను, దివ్యాంగులను, పేదలను, జరిగే అక్రమాలను దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం రేషన్ బండిని ఏర్పాటు చేసింది. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి పదో తేదీ లోపు ఇంటి వద్దకు వచ్చి రేషన్ ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు(ఎండీయు) వ్యాన్ల ద్వారా సరకులు ఇచ్చే విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని అవలంబిస్తోంది. రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలనే నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతోంది.



కరకుదురులో ఎండీయు వాహనం వద్ద రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

పెదపూడి: అప్పట్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడో సుదూర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చౌక దుకాణాలకు వెళ్లేందుకు లబ్ధిదారులు అనేక వ్యయ ప్రయాసలకు గురయ్యేవారు. రేషన్ కోసం ఓ రోజు పని మానుకోవాల్సి పరిస్థితులు ఉండేవి. రేషన్ షాపుల వద్ద సరకుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. చాలా మంది సకాలంలో రేషన్ దుకాణానికి వెళ్లలేక పోయినా మొక్కుబడిగా ఒకటి, రెండు రోజులు రేషన్ సరకులు, బియ్యం ఇచ్చి మిగిలిన మొత్తం బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించేవారు. ఇలాంటి పరిస్థితిని నివారించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐరిష్, డిజిటల్ పద్ధతి ద్వారా వేలిముద్రలు సేకరించి ఇంటి వద్దనే నాణ్యమైన బియ్యాన్ని, నిత్యావసర సరకులను లబ్ధిదారులకు అందించేలా ఏర్పాటు చేసింది. ఇంటింటికీ రేషన్ పథకం అమలు చేసింది. దీనిలో భాగంగా ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసింది. ఈ వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇంటి ముంగిటకు వెళ్లి సరకులు పంపిణీ చేసేవారు. ఎండీయూ వాహనాల వద్దకు వెళ్లలేని వయోవృద్ధుల ఇళ్ల వద్దకు వాహన దారులే రేషన్ సరుకులను అందించేవారు. వాహనాల రద్దుతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మరోవైపు తాము ఉపాధి కోల్పోవాల్సి వస్తుందని ఎండీయూ వాహన డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో 109 ఎండీయూ వాహనాలు, 1,79,883 రేషన్ కార్డులు ఉన్నాయి. వాహనాల ద్వారా లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి రేషన్ సరకులు అందించేవారు. ఇప్పుడు ఎండీయూ వాహనాలు రద్దుతో ఆ లబ్ధిదారులు సమీపంలోని రేషన్ షాపులకు వెళ్లి సరకులు తెచ్చుకునే దుస్థితి ఏర్పడనుంది.



కరకుదురులో ఎండీయూ వాహనం వద్ద రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

మండలం	రేషన్‌షాపులు	రేషన్ కార్డులు	ఎండీయూ వాహనాలు
అనపర్తి	39	23004	14
బిక్కవోలు	40	22,986	14
పెదపూడి	42	23,786	16
రంగంపేట	30	21,070	13
రాజానగరం	48	36,905	17
కోరుకొండ	43	27,500	19
సీతానగరం	48	24,632	16
మొత్తం	290	1,79,883	109

ఇబ్బందులు తప్పవు



వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరకుల పంపిణీ విధానాన్ని రద్దు చేయాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గం. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విధానాన్ని అమలు చేసి మేలు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చి మళ్లీ పాత పద్ధతిని ఏర్పాటు చేసి ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది.

– సమ్మంగి పద్మావతి, లబ్ధిదారురాలు, పెదపూడి గ్రామం

నాలాంటి వృద్ధులకు కష్టం



ప్రతి నెలా ఇంటి వద్దకే వచ్చి రేషన్ బియ్యం ఇచ్చేవాళ్లు. వయస్సు మీద పడడంతో నడవడం కష్టంగా ఉంది. ఇప్పుడు రేషన్ బియ్యం ఇచ్చే వాహనాలను తీసేస్తున్నారని అంటున్నారు. నాలాంటి వృద్ధులకు కష్టం. నాకు తోడుగా కుటుంబ సభ్యులు ఎవరూ లేరు. డీలర్ దగ్గరకు వెళ్లి వేలి ముంద్ర వేయాలంటే కష్టమే. వాహనం ఇంటికి వస్తేనే బాగుంటుంది.

– పోతుల నాగమ్మ, వృద్ధురాలు కరకుదురు గ్రామం

ఉపాధి కల్పించాలి



రేషన్ బియ్యం పంపిణీ చేసే ఎండీయూ వాహనాలను రద్దు చేయడం వల్ల మాకు జీవనోపాధి పోతుంది. ప్రభుత్వం సడన్‌గా ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల ఇబ్బంది పడాల్సి వస్తోంది. బతుకుదెరువు లేకుండా పోయింది. భార్య, ఇద్దరు పిల్లలతో నా కుటుంబం రోడ్డున పడింది. మాకు ఉపాధి కల్పించాలి.

– ఎస్.రవి, ఎండీయూ వాహనం డ్రైవర్ కరకుదురు గ్రామం

సుబ్రహ్మణేశ్వరునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బిక్కవోలు: స్థానికంగా కొలువైన ఉన్న కుమార సుబ్రహ్మణేశ్వరస్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రావణ మాసం మూడో మంగళవారం, సందర్భంగా భారీ ఎత్తున భక్తులు స్వామివారి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నసమారధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని ఈవో భాస్కర్, సిబ్బంది ప్రసాద్, సత్తిబాబు తదితరులు సేవలందించారు.

23న ఉపాధి గ్రామ సభలు

రాజానగరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనుల గుర్తింపు, అందుకు తగిన కార్యాచరణను రూపొందించేందుకు మండలంలో ఈనెల 23న గ్రామ సభలు నిర్వహించనున్నామని ఎంపీడీఓ జి.జ్యోతిర్మయి తెలిపారు. గ్రామ సభలలో చేసిన తీర్మానాలను పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వాటికి పరిపాలన పరమైన అన్ని రకాల అనుమతులు పొందేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ గ్రామ సభలు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఆధ్వర్యంలో జరగనున్నాయి.

కొవ్వొత్తుల ప్రదర్శన

రాజానగరం: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యకాండాన్ని నిరసిస్తూ స్థానిక గాంధీ బొమ్మ సెంటరులో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన గాంధీ బొమ్మ సెంటరు వరకూ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి, ముష్కర మూకల అమానుషానికి బలైపోయిన వైద్యురాలు డాక్టర్ మౌమిత దేబ్‌నాథ్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్య సాధనపైనే గురి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రుల ఆశయాలను గుర్తెరిగి వ్యవహరించడంతోపాటు తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలనే తపనతో నిరంతరం కృషి చేయాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. యూనివర్సిటీ ఆఫ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన బిటెక్ ఫస్టియర్ విద్యార్థులకు మంగళవారం ‘దీక్షారంబ్’ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చదువులో చురుగ్గా ఉండడమే కాకుండా నైపుణ్యాభివృద్ధిలోను సరైన పట్టును సాధించిన వారికి రాబోయే కాలంలో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. సరైన లక్ష్యం, ప్రణాళిక, అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

మూడో పట్టణ సీఐగా దుర్గారావు బాధ్యతలు



కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం మూడో పట్టణ సీఐగా వి.దుర్గారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల పోలీస్ శాఖలో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా దుర్గారావు టూ టౌన్ సీఐగా ఇక్కడకు వచ్చారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలోనూ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారి పైన, గంజాయి సారా వంటి నిర్మూలన తన కర్తవ్యమని సీఐ దుర్గారావు తెలిపారు.

మీ సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

జిల్లా కలెక్టరు ప్రశాంతి



వెలుగుబందలో లేఅవుట్‌ని సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టరు

రాజానగరం: ప్రభుత్వం పంపిణీ చేసిన లేఅవుట్‌లో సత్వరమే నిర్మాణాలు పూర్తి చేసుకుంటే, వాటిలో నివాసాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం నగరవాసులకు మండలంలోని వెలుగుబంద శివారులో ఇచ్చిన నివాస స్థలాలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను మంగళవారం సాయంత్రం కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా కొంతమంది లబ్ధిదారుల అభిప్రాయాలు కూడా తెలుసుకున్నారు. ఈ లేఅవుట్‌లో రోడ్ల నిర్మాణం లేక వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నామని లబ్ధిదారులు కలెక్టరుకు విన్నవించుకున్నారు. మీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టరు ఆర్. కృష్ణనాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ డి.బాలశంకరరావు, డిఈ సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూడాలి



సీతానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: వ్యాధులకు కారణమైన దోమలు వృద్ధి చెందకుండా ఎక్కడా నీటి నిల్వలను లేకుండా చూడాలని సీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య సూచించారు. మంగళవారం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రపంచ దోమల నివారణా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో దోమల వలన వచ్చే వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమ కాటుతో మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయని, ఇళ్ల మధ్య ఉన్న నీటి నిల్వలను పారబోయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు ఎస్.రాజు, కె.మేఘన, సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్ కె. సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ స్వామి, ఎంఎల్‌హెచ్‌పీలు సౌజన్య, జి.స్వరూప, స్టాఫ్‌నర్స్ పి.నాగమణి, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్ సర్వీసింగ్ శిక్షణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్ సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్ల వయస్సు, పదో తరగతి చదివినవారు అర్హులన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి 13 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ సమయంలో భోజనం, వసతి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు రాజమహేంద్రవరం ఆల్కాట్‌తోటలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణాసంస్థ కార్యాలయం, లేదా 77805 99939, 9014328803 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

డాక్టర్ కర్రి రామారెడ్డికి సత్కారం



డాక్టర్ కర్రి రామారెడ్డిని సత్కరించిన అరసం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అరసం తూర్పుగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షుడు, నిత్య విద్యార్థి డాక్టర్ కర్రి రామారెడ్డి 38వ డిగ్రీ పొందిన సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జిల్లా శాఖ ఘనంగా సత్కరించింది. మంగళవారం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని మానస హాస్పిటల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అరసం జిల్లా శాఖ అధ్యక్షులు పడాల వీరభద్రరావు మాట్లాడుతూ డాక్టర్ కర్రి రామారెడ్డి నిత్య విద్యార్థిగా 38 డిగ్రీలు, రాష్ట్రపతిచే అవార్డు పొంది రాజమహేంద్రవరానికే కాకుండా దేశానికే గర్వకారణంగా నిలిచారన్నారు. ఆయన తూర్పు గోదావరి జిల్లా అరసం గౌరవ అధ్యక్షులుగా వ్యవహరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సంవత్సరం జనవరిలో పడాల రామారావు జీవితం–సాహిత్యం, ఇప్పుడు ఆగస్టు 15న 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదలైన అల్లూరి సీతారామరాజు వాస్తవ చరిత్ర గ్రంథాల ముద్రణకు డాక్టర్ రామారెడ్డి సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో లోలభట్టు శ్రీనివాసరాజు, అరసం జిల్లా కార్యవర్గ సభ్యుడు బూడిద వీర్రాజు,రచయిత మల్లెమొగ్గల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి మీద కునుకు లేదాయె..

- ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు
- పేరుకుపోతున్న చెత్త, మురుగు
- వృద్ధి చెందుతున్న దోమలు
- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని స్థల యజమానులు
- రూరల్, సిటీ నియోజకవర్గాల్లో 10 వేలకు పైగా ఖాళీ స్థలాలు
- పంచాయతీలలో నోటీసులు, నగరపాలక సంస్థలో అపరాధ రుసుం వసూలు



బొమ్మూరు మురళీకొండపై ఇళ్ల మధ్య మురికికూపంగా ఉన్న ఖాళీ స్థలం



నగరపాలక సంస్థ 16వ డివిజన్ ఆదర్శనగర్‌లో ఇళ్లల మధ్య ఖాళీ స్థలం దుస్థితి

రాజమహేంద్రవరం రూరల్: కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న దోమలకు ఖాళీ స్థలాలు నిలయాలుగా మారుతున్నాయి. సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు కొంతమంది, ఆదాయ వనరులు పెంచుకునేందుకు మరి కొందరు ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి వాటిని అలాగే వదిలేస్తున్నారు. ఈ స్థలాలు ఖాళీల్లో చెత్తాచెదారం, వర్షపునీరు పేరుకుపోయిగా మురికి కూపాలుగా మారుతున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పది వేల ఖాళీ స్థలాలు

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలో కడియం, రూరల్ మండలాలతో పాటు, రాజమహేంద్రవరం నగరపాకల సంస్థ పరిధిలో సుమారు 10 వేలకు పైగా ఖాళీ స్థలాలు దర్శనమిస్తున్నాయి. ఆదాయ వనరులను పెంచుకునేందుకు ఇళ్లస్థలాలు కొనుగోలు చేసిన యజమానులు పట్టించుకోకపోవడంతో ఆ స్థలాల్లో మొక్కలు, పొదలుతోపాటు, పరిసర ప్రాంత ఇళ్లల్లోని మురుగునీరు వచ్చి చేరడంతో మురికికూపంలా మారుతున్నాయి. దానిలో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. దోమలు కుట్టడం వల్ల జ్వరాలు, అంటు వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ప్రజలు గ్రామ స్థాయిలో పంచాయతీ అధికారులకు, నగరపాలక సంస్థ పరిధిలో అధికారులకు విన్నవించడం, వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం ఉండడంలేదని వారు చెబుతున్నారు.

నోటీసులు ఇచ్చినా..

గ్రామ పంచాయతీలలో ఖాళీ స్థలాలకు పంచాయతీ కార్యదర్శులు నోటీసులు జారీ చేసినప్పటికీ ఎటువంటి స్పందన రావడం లేదు. స్వయంగా పంచాయతీ కార్యదర్శి స్థల యజమానికి ఫోన్ చేసి ఖాళీ స్థలంలో మట్టిఫిల్‌చేసుకుని, పరిసర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేస్తున్నా ఎటువంటి చలనం ఉండడంలేదు. నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాలకు నోటీసులు జారీ చేసి అపరాధ రుసుం కూడా వసూలు చేస్తున్నారు. దీని వలన నగరపాలక సంస్థ కొంత మేర ఆదాయం వస్తున్నప్పటికీ ప్రజలకు ఇబ్బంది పూర్తిస్థాయిలో ఖాళీ స్థలాలు వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల మధ్య ఖాళీస్థలాల్లో మట్టి ఫిల్లింగ్ చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

తమ ఇళ్ల మధ్య ఖాళీస్థలాలు వలన దోమలకు నిలయాలుగా మారింది. దీని వలన చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినప్పటికీ, అధికారులు సదరు స్థల యజమానితో మాట్లాడినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదు. స్వయంగా జిల్లా పంచాయతీ అధికారికి సైతం ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలి.

–సరస్వతి, విశ్రాంత ఎంపీడీవో, మురళీకొండ, బొమ్మూరు

ఎన్ఐటీ విద్యార్థికి ఎన్నారై చేయూత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): చదువుల్లో ముందున్న ఓ విద్యార్థి ఉన్నత విద్యకు పేదరికం అడ్డు వచ్చింది. ప్రాథమిక స్థాయి నుంచి అన్నింటా అగ్రగామిగా నిలిచిన ఆ విద్యార్థి భోపాల్ ఎన్ఐటీకి ఎంపికయ్యాడు. తీరా అక్కడకు వెళ్లి చదువుకోవాలంటే హాస్టల్‌లో ఉండాలి. హాస్టల్‌లో ఉండేందుకు అంత మొత్తం సొమ్ము చెల్లించే స్థోమత ఆ కుటుంబానికి లేదు. తండ్రి ఆటో డ్రైవర్. ఈ పరిస్థితి తన స్నేహితుల ద్వారా తెలుసుకున్న ఒక ప్రవాస భారతీయురాలు ముందుకు వచ్చి ఆదుకున్నారు. రాజమహేంద్రవరానికి చెందిన సప్పా పార్థుకు భోపాల్ ఎన్ఐటీలో హాస్టల్‌కు అయ్యే ఖర్చు రూ.35వేలు ఎన్ఆర్ఐ సముద్రాల శుభశ్రీ మంగళవారం అతని ఖాతాలో జమ చేశారు. ఆమె ప్రముఖ సినీ రచయితలు సముద్రాల సీనియర్, సముద్రాల జూనియర్‌ల వారసురాలు. పార్థు రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి, ఇంటర్‌లో 98 శాతం, జేఈఈ మెయిన్స్‌లో 98.8 మార్కులు సాధించి ఎన్ఐటీ భోపాల్‌లో ఎలక్ట్రానిక్స్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా శుభశ్రీ, ఆమె స్నేహితులకు ఆ పేదకుటుంబం కృతజ్ఞతలు తెలిపింది

నేటి నుంచి వాలీబాల్ పోటీలు

రాజమహేంద్రవరం రూరల్: కవలగొయ్యిలోని ది ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా అండర్–14, అండర్–17, అండర్–19 కేటగిరీలకు చెందిన ఐసీఎస్ఈ, ఐఎస్‌సీ విద్యార్థులకు బుధవారం నుంచి రెండురోజులు పాటు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి ఓప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన సుమారు 30 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారన్నారు.